

# మరో అడుగు

## - డా.వేదుల సుభద్ర



(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

తడబడే అడుగులతో, చిక్కబట్టుకున్న గుండెలతో కూతురి మెత్తని చేతులిద్దరూ చెరొకటీ పట్టుకుని హాస్పటల్ లోపలకి నడిచారు.

రిసెప్షన్ లో పేరు, ఇతర వివరాలు నమోదు చేసుకున్నాకా, కొంతసేపు ఎదురు చూడమన్నారు.

ఆ తర్వాత ‘పాపని టెస్ట్ కోసం లోపలకి తీసుకువెళ్ళాలి ‘అని చెప్పారు.

స్వప్నిక ను లోపలకి తీసుకువెళ్తున్నప్పుడు రాధిక తను కూడా వస్తానని పట్టుబట్టింది కానీ నర్స్ వారించింది.

" నేను మిమ్మల్ని డిస్టర్బ్ చెయ్యను, ఊరికే పక్కనే ఉంటాను. ఇంజెక్షన్ అంటేనే భయం మా స్వప్నికి, ప్లీజ్" అంది రాధిక అభ్యర్థిస్తున్నట్టుగా.

"వద్దమ్మా, మేము చూసుకుంటాం, సాధారణంగా ఎవరినీ అనుమతించరు. మరీ చిన్నపిల్లకాదుకదా. పాపకేమీ భయం లేదు, టెస్ట్ అయిపోగానే మేమే పిలుస్తాం కదా " అంది.

చేసేదేమీ లేక బయట కూర్చుని వేచి చూడసాగారు.

తర్వాత దాదాపు రెండుగంటలు ఎన్నో యుగాలుగా గడిచాయి రాధిక, కిరణ్ లకి.

ఆ తర్వాత బయటకి వచ్చిన నర్స్ 'పాపని చూడవ చ్చు ‘ అని చెప్పడంతో రాధిక పరుగున వెళ్ళింది లోపలకి.

" స్వప్నీ" అని పిలవబోతున్న రాధికని వారించింది నర్స్.

" కొంచం భయపడింది, కాసేపు నిద్ర పోతుందని మైల్డ్ సెడేషన్ ఇచ్చారు డాక్టర్. మరో అరగంటలో తెలివి వస్తుంది. ఆ తర్వాత ఒక అరగంట చూద్దాం, అప్పుడు పంపించేద్దాం ఊరికే చూస్తారని పిలిచాను, పడుకున్నదాన్ని లేపకండి "అంది నర్స్.

ఆ తర్వాత వచ్చిన డాక్టర్ కూడా ' మరేమీ పరవాలేదు. అంతా బాగా జరిగిం ది' అని చెప్పడంతో తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది.

నెమ్మదిగా తెలివి వచ్చింది స్వప్నికకి .

ఎంత బాధపడిందో తెలియలేదు కానీ, బేలత నాన్ని దాచుకుందుకు ప్రయత్నిస్తూ చిరునవ్వు నవ్వడానికి ప్రయత్నిస్తున్న కూతురిని దగ్గరకు తీస్కుంది రాధిక.

అప్పటికి లోపలకి వచ్చిన కిరణ్ " బాగా నొప్పిగా ఉందా తల్లీ" అని మాత్రం అనగలిగాడు కిరణ్.

'లోకల్ అనె స్తీ సియా ఇచ్చి చేసినందున మొదటగా చురుక్కుమన్న నొప్పి తప్ప మరేమీ ఎక్కువగా తెలియనందున " ఎక్కువగా లేదు నాన్నా" అంది స్వప్నిక మగతగా

అంతలోనే, అలసటగా ఉన్నట్టుగా కళ్ళు మూసుకుంది.

నెమ్మదిగా రాధిక విషయం చెప్పింది కిరణ్ కి. "ఆ సెడేటివ్ వల్లనే మగతగా ఉంది " అంటూ.

విశాలమైన కళ్ళని మూసుకుని ప్రశాంతంగా నిద్రపోతున్న కూతురి జుట్టు సవరిస్తూ ఉండిపోయాడు కిరణ్.

కాసేపయిన తర్వాత పూర్తిగా తెలివి వచ్చింది స్వప్నిక కి.

లేస్తూనే తనవైపే చూస్తున్న తండ్రిని చూసి " నాన్నా!" అంటూ చిన్న పాటి ఆనందంతో రెండు చేతులూ చూపి తండ్రిని మెడను చుట్టేశింది.

" ఎలా ఉందిరా నాన్నా?" అంటూ అడిగాడు

" ఏమీ లేదు నాన్నా, బాగానే ఉన్నానుగా. కొద్దిగా నొప్పి అంతే" అంది సూది గుచ్చిన చోట చూపిస్తూ.

అంతలోనే ఏదో గుర్తొచ్చినట్టు.

" నాన్నా, ఐస్క్రీం కొంటానన్నావు కదా" అంది, కిరణ్ మెడ చుట్టూ వేసిన చేతుల పట్టు బిగించి అతన్ని కిందకు లాగుతూ.

" ఓ యెస్, ఎనీథింగ్ ఫర్ మై ప్రిన్సెస్, ఇప్పుడే " అన్నాడు కిరణ్

" వద్దులే, ఇంటిదగ్గర కొందాం, తమ్ముడికీ కొనాలి కదా. ఇక్కడే కొంటే మనం ఇంటికి వెళ్ళేసరికి కరిగిపోతుంది " అంది స్వప్నిక.

చప్పున కూతురి బుగ్గ మీద ముద్దు పెట్టింది రాధిక, 'ఎప్పుడూ తమ్ముడిని మరిచిపోదు, బంగారు తల్లి" అంటూ.

" అమ్మా!" అంటూ తల్లిని చుట్టేసింది

ఇంతలో నర్స్ వచ్చిన స్వప్నిక ని పరీక్షించి, అంతా బానేఉంది, ఇంటికి వెళ్ళిపోవచ్చు మీరు అని చెప్పడంతో

వచ్చిన పని పూర్తయినందున, టెస్ట్ కి అవసరమైన డబ్బు కట్టి, రిజల్ట్ ఎప్పుడు వస్తుందో ? కనుక్కుని ఇంటిదారి పట్టారు ముగ్గురూ.

ఇంటి దగ్గర ఐస్ క్రీం షాప్ దగ్గర ఆగి రెండు కప్పులు ఐస్ క్రీం కొన్నాడు కిరణ్.

మర్నాడు డాక్టర్ రాజేష్ ఫోన్ చేసి 'పరీక్ష రిజల్ట్ తెలియడానికి మరో నాలుగు రోజులు పడుతుంది అని, రాగానే తనే ఫోన్ చేసి సుజిత్ తో సహా కలిసి మాట్లాడతామని ' చెప్పాడు.

పండగ రోజులు కావడాన పిల్లలకి రెండు రోజులు స్కూల్ సెలవులు వచ్చాయి.

" అమ్మా, హాయిగా జున్ను తినేశాం కానీ, మనం కాఫ్ ని చూడడానికి వెళ్ళనే లేదు కదా!. ఇప్పుడు స్కూల్ లేదుగా, వెళ్దామా తాతా వాళ్ళింటికి? " అంది స్వప్నిక.

" మన కార్ లోనే వెళ్ళచ్చు కూడా హాయిగా " అన్నాడు సాహిల్ కూడా.

గత కొద్ది నెలలుగా స్వప్ని అనారోగ్యంతోనూ, హాస్పటల్ రాకపోకల్లోనూ మిగతా విషయాలని పెద్దగా పట్టించుకోవటం లేదనీ, తల్లి తండ్రులతో మనసారా మాట్లాడి చాలా రోజులయిందని గుర్తు తెచ్చుకున్న కిరణ్ కి కూడా అది మంచి ఆలోచనగా తోచింది.

వెంటనే తండ్రి కి ఫోన్ చేసి చెప్పాడు వస్తున్నామని. మనవలకి పిండివంటలు చెయ్యడంలో పడింది తులశమ్మ.

‘" ఏమ్మా, పాపమ్మకి జ్వరం తగ్గిందా, బానే ఉందా?" వెళ్ళిన గంటకి అత్తగారు అడిగిన ప్రశ్నకి.

" పరవాలేదు అత్తయ్యా, తగ్గుతోంది" అని చెప్పింది.

స్వప్నిక ని అందరూ స్వప్నిక, స్వప్ని అని పిలిచినా తులశమ్మ మాత్రం ఎప్పుడూ పాపమ్మా అనే పిలుస్తుంది, అలాగే సంబోధిస్తుంది.

" నాన్న నాకు అంత మంచి పేరు పెడితే ఇలా పిలుస్తావేం?" అని నాన్నమ్మతో పోట్లాడుతూ ఉంటుంది స్వప్నిక.

" పోన్లే తల్లీ, పిల్లలకేదైనా అయితే తల్లడిల్లిపోతాం నేనూ, వాళ్ళ తాతా.

తగ్గిందని చెప్పావు, అంతే చాలు, రేపు శనివారం గుడికెళ్ళి ఓ కొబ్బరికాయ కొట్టొస్తా. " అంది సంబరంగా తులశమ్మ.

ఇతరవివరాలు చెప్పి, పెద్దావిడని బాధ పెట్టడం ఇష్టం లేక అప్పటికి ఊరుకుంది రాధిక.

కిరణ్ మాత్రం స్వప్నిక కి తరచుగా ఏదో ఒక రుగ్మత వస్తోందని, బ్లడ్ టెస్ట్ లు అవీ చేయించమని చెప్పారనీ, అవన్నీ చేయిస్తూ ఎప్పటికప్పుడు డాక్టర్ల సలహాలు తీస్కుంటున్నామని స్థూలంగా చెప్పాడు తండ్రికి.

అంతకన్నా చెప్తే వారిద్దరిని  ఆందోళన కి గురి చెయ్యడమే తప్ప మరేమీ ఉండదని అనుకున్నాడు.’

వీళ్ళు వచ్చిన వార్త విని రాధిక నాన్న కూడా వచ్చారు. ఊర్లో ఉన్న నాలుగు రోజులు  తాతా, నాన్నమ్మల గారాబాలతో పిల్లలకీ, వీళ్ళ ఆట పాటలతో పెద్దవాళ్ళకీ సరదాగా, సందడిగా గడిచిపోయాయి.

" మనం ఊరు వెళ్ళి రావడం మంచిదయింది, లేకపోతే రిపోర్ట్ మీదే మనసు ఉండిమరింత  టెన్షన్ గా ఉండి ఉండేది" ఇంటికి వస్తూనే అన్నాడు కిరణ్.

సన్నగా నవ్వింది రాధిక.

అత్తగారింట్లో హాయిగా నాలుగు రోజులు గడిపివచ్చిన వారి మనసుల్లో మళ్ళీ పరుచుకున్న ఆత్రుత, ఆందోళన.

మర్చిపోలేదు కానీ, పెద్దవారి సమక్షంలో కాస్త సేద తీరిన మాట నిజం.

మన సుఖ సంతోషాలను చెప్పుకునే మనుషులు, ముఖ్యంగా పెద్దవారు ఉండ దం ఎంత అవసరమో కదా అనిపించింది రాధిక కి.

తండ్రి కి బాగోలేదని చూడడానికి వెళ్ళిన రోహిణి లేకపోవడంతో మరీ ఒంటరిగా ఉంది ఆమెకి.

ఆ రోజు సాయంత్రం ఫోన్ చేశారు రాజేష్.

" మరొక గంట ఆగి మీరిద్దరూ నా ఆఫీసుకి రాగలరా?" అని అడిగాడు.

" వచ్చేస్తాం డాక్టర్, సరిగ్గా గంటలో మీ ముందుంటాం" అన్నాడు కిరణ్.

" సరే, సీ యూ సూన్" అంటూ ఫోన్ పెట్టేశాడు డా.రాజేష్.

" ఏమన్నారు? టెస్ట్ రిపోర్ట్ వచ్చేసిందా? ఏముంది దాంట్లో?" ఆత్రుతగా అడిగింది.

"ఏమీ చెప్పలేదు, మరో గంటలో రమ్మన్నారు" అన్నాడు.

" టెస్ట్ రిజల్ట్ గురించి అడగద్దా, అడక్కుండానే పెట్టేశారు" విసుగ్గా అంది రాధిక.

" అడిగే అవకాశం ఆయన ఇవ్వనే లేదు రాధీ, ఏం చెయ్యను చెప్పు? అర్థం చేసుకో, నీకున్నంత టెన్షన్ నాకు కూడా ఉండదా? వెళ్ళు, లేచి ముఖం కడుక్కొని తయారవ్వు. డాక్టర్ గారి దగ్గరకి వెళదాం".

అన్నాడు అనునయంగా.

మరో గంటలో డాక్టర్ రజేష్ ఆఫీస్ దగ్గర ఉన్నారు.

వారికోసమే ఎదురుచూస్తున్నట్టుగా దుర్గ " రండి, రండి. డాక్టర్ మీకోసమే ఎదురు చూస్తున్నారు" అంటూ చెప్పింది.

డాక్టర్ ఆఫీస్ లో కాస్త దిగులు సంతరించుకున్న ముఖంతో కనిపించిన డా.రాజేష్ ని చూడగానే చిక్కబెట్టుకున్న ధైర్యం జారిపోయినట్టయింది రాధిక కి.

కిరణ్ అభావంగా ఉన్నాడు.

"రండి, రండి. సుజిత్ కూడా వస్తూ ఉంటాడు" అన్నాడు డా.రాజేష్.

కలవరం కనిపిస్తున్న రాజేష్ ముఖం, తాము వచ్చేసరికి డా.సుజిత్ ని రమ్మని ఆయన చెప్తున్న ఫోన్ కాల్ ఇవన్నీ టెస్ట్ లో ఉన్నది మంచి వార్త కాదని చెప్పనే చెప్పాయి వాళ్ళిద్దరికీ.

"డాక్టర్, ఏమయింది? రిపోర్ట్ లో ఏముంది?" అన్నాడు కిరణ్.

" సుజిత్ వచ్చేస్తున్నాడు. రాగానే మొత్తం వివరంగా చెప్తాడు, స్నేహ కూడా రావాలి ఇప్పటికే" అన్నాడు డా. రాజేష్.

కిరణ్ అడిగినదానికి సమాధానం చెప్పకుండా.

మరో ఇరవై నిముషాలు భారంగా కదిలాక, డా.సుజిత్ వచ్చారు.

వస్తూనే ఒక్క నిమిషం పాటు రిపోర్ట్ అంతా తిరగేసి..

" ప్చ్. మొదటినించీ నేను అనుకున్నదే, రాజేష్ ఇట్ ఈజ్ సాడ్ బట్ ట్రూ.

నేను మొదటినించీ అనుకుంటూనే ఉన్నాను. ఇది లుకేమియా అయి ఉండచ్చన్నదే మొదట్నుంచీ నా అనుమానం. దీన్ని సరిగ్గా డయాగ్నైజ్ చెయ్యాలి రాజేష్. ఎంత తొందరగా గుర్తిస్తే ట్రీట్మెంట్ అంత మంచిది. సమర్థవంతంగా పనిచేస్తుంది కూడా. వి నీడ్ టు యాక్ట్ క్విక్! " అన్నాడాయన.

'లుకేమియా అయి ఉండచ్చు ' అన్న ఒక్క మాట వినగానే పిడుగు పడినట్టుగా ఉండిపోయారు కిరణ్, రాధిక.

కలలో కూడా వినకూడదనుకునే పేరు అది.

అయి ఉండవచ్చు అన్న మాటే భరించలేనిది.

డా.సుజిత్ రాజేష్ లా కాదు. చాలా త్వరగా నిర్ణయాలు తీసుకుంటారు, తను అనుకున్నది క్షణం ఆలస్యం చెయ్యకుండా చెప్పేస్తారు, అమలుపరిచేలా చూస్తారు. అలాగని ఎవ్వరితోనూ కఠినంగా మాట్లాడరు.

ఎప్పటిలాగే రాజేష్ వైపు తిరిగి " మనం మరికొన్ని టెస్ట్ లు చేయించాలి, వెంటనే చేయించేద్దం. కళ్ళు బైర్లు కమ్మినట్టయి పాప పడిపోవడం ( బ్లాక్ అవుట్), తరచుగా వస్తున్న జ్వరం, కీళ్ళ నొప్పులూ, ఇతర లక్షణాలన్నీ అదే అని నాకు నమ్మకంగా అనిపిస్తోంది. ముఖ్యం గా లెక్కకు మిక్కిలిగా ఉన్న తెల్ల కణాల సంఖ్య" అంటూ ఒక్క క్షణం ఆగి ఆ గదిలో ఉన్న మిగతా ముగ్గురి వైపు చూశారు.

తను వింటున్నది నిజమా, కాదా అన్న సందిగ్ధంలో రాజేష్.

అసలు తాము ఏం వింటున్నారో కూడా తెలియని అయోమయం లో కిరణ్ రాధికా ఆయన వైపే చూస్తున్నారు.

ఈ పరుగు వచ్చే నెలదాకా

Post your comments